# అంతస్తు

ఆ ఊరి నుంచి బస్తీ మహా అయితే ముప్పయి మైళ్లుంటుంది. బస్సు ప్రయాణం దాదాపు మూడు గంటలు పడుతుంది. పైగా దార్లో ఉన్న ఊళ్ళని కూడా పలకరించుకుంటూ పోవాలి.

ఆ ఊరినుంచి బస్తీకి రోజుకి రెండు బస్సులువెళ్తాయి. ఉదయం 7 గంటల కొకటి. మధ్యాహ్నం 2 గంటలకి మరొకటి. బస్తీనుంచి బయల్దేరేవి కూడా రెండే. మధ్యాహ్నం 12 గంటల కొకటి. చీకటి పడిన తరవాత– అంటే 7 గంటలకి– మరొకటి.

నర్సింలు 2 గంటల బస్సులో బస్తీకి బయలు దేరాడు. రెండో కొడుకు సత్యం అక్కడ సబ్_కలెక్టర్‌గా ఈ మధ్యే బదిలీ పైన వచ్చాడు. సత్యం తెలివి తేటలున్నవాడు. కష్టపడి చదివి ఐ. ఏ. ఎస్. అయ్యాడు. సొంత ఊరు కొంత దగ్గర్లో ఉంటే తల్లిదండ్రులు ఎప్పుడయినా వచ్చి పోవడానికి వీలుగా ఉంటుందని అక్కడికి బదిలీ చేయించుకున్నాడు. బస్తీ వేరే జిల్లా కిందికి వసుంది. కాబట్టి ఇబ్బంది లేకపోయింది.

సత్యానికి పెళ్ళయి రెండేళ్ళయింది. ఒక కొడుకు సంవత్సరం నిండింది. ఆ రోజే మనువడి పుట్టిన రోజు. అందుకే నర్సింలు బయలు దేరాడు. "సాయంత్రం వేడుక జరుపుతున్నాం. మరీ మరీ రమ్మ"ని రాశాడు. పొలం పనులున్నా ఎవరూ వెళ్ళకపోతే సత్యం చిన్నబుచ్చుకుంటాడని బయలుదేరక తప్పలేదు. పెద్ద కొడుకుని వెళ్ళమంటే నీటి తడుపు పని ఆగిపోతుందని చెప్పాడు.

కొడుక్కి ఇష్టమని తల్లి ప్రత్యేకంగా సున్నిఉండలు. కారప్పూస చేసి ఇచ్చింది. దొడ్లో ముఃగకాడలు కాస్తే అవో కట్ట సిద్ధం చేసింది. కూరగాయల మూట మరొకటి తయారయింది. వెన్న కాచిన నెయ్యి సీసాలో పోసింది. సపోటా పళ్ళు కూడా ఇచ్చింది. మనుమడి పుట్టిన రోజుకి ఒట్టి చేతులతో వెళ్ళే ననలుగురిలో చిన్న తనంగా ఉంటుందని పెద్దాడు చెబితే, ఆచారి చేత ఎర్రరాయి ఉంగరం చేయించాడు. డబ్బు సరిగా వెసులుబాటు కాకపోయినా, రెండు రోజు లుండొచ్చని బట్టలు సర్దుకున్నాడు నర్సింలు.

బయలు దేరే ముందు భార్య జాగ్రత్తగా వెళ్ళి రమ్మని ఒకటికి పదిసార్లు చెప్పింది. కోడల్ని మరీ మరీ అడిగానని చెప్పమంది. ఎప్పుడో పెళ్ళయిన కొత్తలో పెళ్ళి కూతురుగా రావడం తప్ప మళ్ళీ ఆ ఊరికి రాలేదు కాబట్టి చిన్న కోడల్ని ఒకసారి వచ్చి రెండు రోజులుండి వెళ్ళమని కూడా చెప్పింది పెద్ద కోడలు కూడా తన తోటి కోడల్ని రమ్మనమని కబురు పంపింది.

బస్సు కుదుపుకి సామాను కింద పడకుండా రెండు సంచుల్ని మధ్య మధ్య సర్దుతున్నాడు నర్సింలు. పేదరికం అంటే ఏమిటో అనుభవరీత్యా చెప్పగల నర్సింలు జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని ఎప్పటి కప్పుడు ధైర్యంతో ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నాడు. ఇద్దరు కొడుకులు తన మాటని ఎన్నడూ ఎదిరించలేదు. చిన్న కొడుకుని చదివించేందుకు తనతోపాటు పెద్ద కొడుకు కూడా రాత్రిం బవళ్ళు కష్టపడిన సంగతి తలుచుకున్నప్పుడల్లా నర్సింలు కళ్ళు ఆనందంతో చెమరుస్తాలు

బస్సులో ప్రయాణం చేస్తున్న నర్సింలు ఉత్తరీయంతో ముఖం తుడుచుకుంటూ కళ్ళు అద్దుకున్నాడు, అప్పుడప్పుడు బస్తీకి [illegible]

సిన పని ఉన్నా, నర్సింలు వేషం మాత్రం మారదు. కోరా చొక్కా ముతక పంచె, గోరంచు ఉత్తరీయం- ఇవి చాలా కాలంగా అతణ్ణి ఆశ్రయించుకునే ఉన్నాయి. చొక్కాకి కాలరు ఉండదు. పక్క జేబు పెద్దదిగా ఉంటుంది. చొక్కా చేతులు మోచేతుల్ని కొంచెం దాటి ఉంటాయి. పొలానికి వెళ్ళేటప్పుడయితే తలపాగా ఉంటుంది. బొత్తాలకు బదులు బనీను ఉంటుంది, అంట కత్తెరేసిన తల. ఒక మాదిరి బుర్ర మీసాలు. తనని చూడగానే పల్లెటూరు రైతనుకుంటే అందుకు గర్వపడే తత్వం. తనకు చేతకాని డాబుసరి వేషం అంటే గిట్టదు. వయస్సు అరవై దగ్గర పడుతున్నా మొదటినుంచీ శ్రమించిన శరీరం కావడం చేత ఆరోగ్యం దెబ్బ తినలేదు.

ఇంకో అరగంటలో బస్తీ చేరుకోబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మనుమడి పుట్టిన రోజాయె. ఎంత సంబరంగా ఉంది. చిన్నాడు సత్యాన్ని చూసి చాలా రోజులయింది. నాన్న వచ్చాడని వాడికి పట్టరాని సంతోషం కలుగుతుంది, పెద్ద ఆఫీసరయినా వాడికి అమ్మమీదా, నాన్న మీదా ప్రేమ తగ్గలేదు, ఈ వయసులో మాకింకేం కావాలి ? వాళ్ళు పెట్టి పోషించనక్కర్లేదు. దేవుడు రెక్కలు చల్లగా ఉంచినంత కాలం ఏ లోటూ ఉండదు. కోడలు పెద్ద కుటుంబంలోని అమ్మాయి. బాగా చదువుకుంది. పైగా చిన్నాడు ఇష్టపడిచేసుకున్నాడు పండంటి కొడుకుని కన్నది. నా మనవడు దొర బిడ్డ. వాడిది రాజా పుట్టుక నా మీసాలు పట్టుకు లాగుతాడేమో !.... ఊహల్లో పయనిస్తున్న నర్సింలు మీసాల చాటున చిరునవ్వులు తారట్లాడుతున్నాయి.

"ఎవరండీ గంట స్తంభం దిగేది?" కండక్టరు పెద్దగా కేక పెట్టాడు బస్తీ రాగానే

కేక వినగానే నర్సింలుకి గుర్తొచ్చింది. తాను దిగవలసింది అక్కడే అని, సత్యం ఉత్తరంలో వివరంగా రాశాడు. బంగళాకి బస్సు

ఎక్కడ దిగాలో, ఎటువైపుగా వెళ్ళాలో, తాను బయలుదేరే సంగతి చివరిదాకా నిర్ణయం కాకపోవడంతో ముందు రాయడానికి వీలు చిక్కలేదు. రాసి ఉంటే సత్యం గంట స్తంభం దగ్గరికి ఎవరినన్నా పంపే ఉండేవాడు.

రెండు సంచులు చేత్తో పట్టుకుని నెమ్మదిగా బస్సు దిగాడు. గంట స్తంభం గడియారం అయిదున్నర చూపుతోంది.

"బస్తీ రోజు రోజుకి బాగా పెరిగిపోతోంది సుమా! ఇది వరకు ఇంతరద్దీ లేదు. ఇన్ని కార్లూ, ఆటోలు, మోటారు సైకిళ్ళూ లేవు" అనుకుంటూ ఉత్తరంతో చెప్పిన ప్రకారం పెద్ద వేపచెట్టు మొదట్లో ఉన్న రోడ్డు వెంట బయలుదేరాడు. సత్యం ఉండే బంగళా గంట స్తంభం దగ్గర్నుంచి ఎంతో దూరం లేదు. ఫర్లాంగులోపే. ఈ కాస్త దూరానికి రిక్షా ఎందుకు లెమ్మనుకున్నాడు సంచులు పెద్ద బరువుకూడా లేవు. ఆ రోడ్డు వెంట వెళ్తే కుడి చేతివైపు మొదటి వీధి ఒకటో ఇల్లే. దూరం నుంచే తెలిసిపోతోంది. షామియానా వేశారు ముంగిట. ఇంకా పొద్దు గూకకపోయినా, చిన్న చిన్న బల్బులు అలంకరించారు. ముందున్న చెట్లకొమ్మల్లో కూడా బల్బులు వెలుగుతున్నాయి.

చాలామందినే పిలిచినట్టున్నారు, నూట్లతో మగవారూ. పట్టు చీరలతో ఆడంగులూ వస్తున్నారు. కొందరు రకరకాలుగా అలంకరించుకున్నారు.

నర్సింలు కొంచెం ఇవతలే ఉండి, "బాబూ! సబు-కలెక్టరు బంగాళా ఇదేనా!" అని సందేహనివృత్తి కోసం అడిగాడు అటు వెళ్తున్న పెద్ద మనిషిని.

"అవునయ్యా" తెలియటంలా? చిత్రంగా సమాధాన మిచ్చాడు.

బంగళాలోకి వెళ్ళేందుకు బిడియం అనిపించింది. నెమ్మదిగా గేటు చేరుకున్నాడు. లోపల ఒకవైపున షామియానాలో అతిథులంతా ఒకరినొకరు పలకరించుకుంటూ హడావిడిగా ఉన్నారు. దూరంగా కోడలు వచ్చినవాళ్ళని పలకరించి పిల్లవాణ్ణి చూపుతోంది. వాళ్ళు పిల్లవాణ్ణి గోముచేస్తూ, చేతికి బహుమతి అందిస్తున్నారు బంట్రోతులు అతిథులకు కాగితం ప్లేట్లతో ఫలహారాలందిస్తున్నారు. పెద్ద కేకు కోయించి నట్లున్నారు. కొత్త చోటు కాబట్టి, నర్సింలుని కోడలు తప్ప మరెవురూ పోల్చుకునే అవకాశం లేదు

సత్యం జాడలేదు. షామియానా ఉన్నవైపు కాక మరివైపున ఔట్‌హవుస్ ఉంది. ఆ పక్కగా నిలబడి ఏం చేయాలా అని ఆలోచించ సాగాడు నర్సింలు. అటువైపుగా బంట్రోతు కాబోలు ఒకతను హడావుడిగా వేరే పనిపై వస్తే "చూడు, బాబూ సత్యం ఇంట్లో లేడా?" అని అడిగాడు, ఆ మాట వినిపించుకునే తీరుబడి లేదేమో ఔట్‌హవుస్‌లోకి గబగబా వెళ్ళి ఏదో డబ్బా పట్టుకుని బయటికి దూసుకువచ్చాడు. నర్సింలు బతిమాలుతున్నట్లు "సబు-కలెక్టరు గారింట్లో ఉన్నారా, నాయనా?" అని అడిగాడు. "బయటికి వెళ్ళారు ఇప్పుడే అర్జెంటుగా పని మీద. ఆరున్నరకి రావచ్చు" అని గబగబా నడుస్తూనేచెప్పి షామియానాలోకి వెళ్ళిపోయాడు.

తన బట్టలున్న సంచీ ఔట్‌హవుస్ గడప పక్కన పెట్టాడు. పళ్ళు, నెయ్యి, తినుబండారాలున్న సంచీ ఒకచేత్తో పట్టుకున్నాడు. ఉంగరం ఉన్న పొట్లాం మరో చేత్తో పట్టుకున్నాడు కాసేపు తటపటాయించాడు. 'సత్యం వచ్చేదాకా అక్కడే నుంచుందామా అనుకున్నాడు. కాని, మనస్సు మనుమడి దగ్గరి కెప్పుడెళ్తామా అని ఒకటే ఉబలాట

పడుతోంది. 'తన మనుమడి దగ్గరికి తాను వెళ్ళేందుకు వెనకా ముందాడడమెందు' కనుకున్నాడు. పైగా బస్సుప్రయాణం బడలిక వల్ల ఎక్కువ సేపు నుంచోవడం ఇబ్బందిగా ఉంది. అది తన కొడుకు ఇల్లు తనకు వెళ్ళే అధికారం ఉంది. వచ్చినవాళ్ళు పెద్దపెద్ద ఆఫీసర్లు కావచ్చు కాని, పుట్టినరోజు తన మనుమడికి వెంటనే వెళ్ళి పళ్ళ సంచీ ఇచ్చి మనుమణ్ణి ఎత్తుకుని ఉంగరం వాడి చిట్టి వేలికి పెడితే కోడలు తప్పక సంతోషిస్తుందకున్నాడు.

షామియానాలో ప్రవేశించాడు. సీతాకోక చిలుకల్లా ఉన్న ఆడవాళ్ళు నర్సింలు అలా రావడం చూసి ముఖాలు అదోలా పెట్టారు ఏవగించుకుంటున్నట్లు, మగవాళ్ళు కొంచెం ఆశ్చర్యంగా చూస్తున్నారు.

కోడలు దగ్గరికి వెళ్ళి "అమ్మా బాగున్నావా!" అని పలకరించి "బాబూ....నా దగ్గరికొస్తావా." అని సంచీ కింద పెట్టి చేతులు చాచాడు

చుట్టూ ఉన్న అతిథులు ఇది గమనించకూడదన్నట్లు కోడలు బంట్రోతును పిలిచింది. మనుమణ్ణి మరో యువతి పలకరిస్తోంది.

నర్సింలు ఉంగర ఉన్న పొట్లాం కోడలికందించాడు. "ఇందులో ఉంగరం ఉంది. బాబుకి"అని చెప్పాడు. కోడలితో, ఆవిడ మరో వైపుకి చూస్తున్నా.

బంట్రోతు రాగానే "ఔట్‌హవుస్‌లోకి తీసుకెళ్ళు, సంచీ లోపల పెట్టు" అని పురమాయించి ఇంకెవరో జంట వస్తుంటే ఆహ్వానించేందుకు ఎదుడు వెళ్ళింది పక్కనున్నామె 'ఎవరతాను.... ఇలా వచ్చేడాడు? బంట్రోతులంపా ఏమయ్యారు?' అని విసుక్కుంటున్నట్లు కోడలిని ఉద్దేశించి అంది కోడలు చెప్పిన సమాధానం నర్సింలుకి వినబడింది. "మా మామగారు ఊర్నించి పంపించారు...." తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు. బంట్రోతు వెంట ఔట్‌హవుస్‌లోకి వెళ్ళాడు.

బయట పెట్టిన తన బట్టల సంచీ తీసుకొచ్చుకున్నాడు. అక్కడ ఒక మంచం, దానిపైన జంపకానా. రెండు ఉన్నాయి. గూట్లో మంచి నీళ్ళ కూజా, గానిపైన గాజు గ్లాసు ఉన్నాయి. నర్సింలుని అక్కడ దిగబెట్టి బంట్రోతు హడావుడిగా షామియానాలోకి వెళ్ళిపోయాడు.

బాగ దాహంగా ఉంది. మంచినీళ్ళు తాగాడు.

కోడలు తన గురించి చెప్పిన మాటలు చెవుల్లో మారుమోగుతు న్నాయి. మా మామగారు ఊర్నించి పంపించారు ... మా మామగారు ఊర్నించి పంపించారు.... మా మామగారు ఊర్నించి పంపించారు.... నిలబడలేక మంచంమీద కూర్చున్నాడు.

'ఈ మాటలన్నది నా కోడలేనా? అవును. న్యాయా నా నా చిన్న కొడలే! నేను ఆమె మామని కానన్న మాట, ఇంకా నయం.... మామగారు అన్నది, నేనే తన మామనని ఆమె ఇతరులకు చెబితే నామోషీనా! నే నామె మామని కాదు మామ పంపిన మనిషినా? మరి నేను ఎందుకొ చ్చాను. ఎండలో పడి? ఎప్పుడు చూద్దామా అని తహతహతో వచ్చానే! వచ్చిన వాడికి కాసిన్ని మంచినీళ్ళైనా ఇవ్వదా?

ఎంత సందట్లో ఉన్నా పలకరించనైనా వద్దా? మనుమణ్ణి సరిగా చూడనివ్వలేదే! ఒక్కసారి ఎత్తుకో నివ్వలేదే! నేను ఇక్కడ ఉండడం అమెకి ఇబ్బందిగా ఉండచ్చు. ఇంకెవరైనా వచ్చి నేనెవరిని అని అడి గితే ఆమె చాలా ఇరకాటంలో పడుతుంది. ఇల్లంతా సందడిగా ఉంది. పెద్ద పెద్ద ఆఫీసర్లూ, వాళ్ళ భార్యలూ వస్తున్నారు. నా చిన్న దలినికో ఇంకా ఇబ్బంది పెట్టడం అయిపోయింది. మనుమణ్ణి. కోడల్ని, చూసాను సంచీ ఇచ్చేశాను సత్యాన్ని చూడలేదు. వాడితో మాట్లాడలేదు. వాడికి అమ్మ అన్నా వదినల గురించిన సంగతులు చెప్పలేదు. వాడేదో అర్జెం

టు పనిమీద బయటికి వెళ్ళాడట. వచ్చేవరకూ ఈ ఇంట్లో ఉండలేను. నర్సింలు మనస్సును ఆలోచనలు వేధిస్తున్నాయి.

ఏడు గంటల బస్సుకి వెళ్ళిపోవడమే ఉత్తమమనుకున్నాడు. సత్యం ఆరున్నరకి రావచ్చునని బంట్రోతు చెప్పాడు అయినా, అంత వరకు బంగళాలో ఉండడం అసాధ్యమనిపించింది.

సంచీ పుచ్చుకున్నాడు గది ఇవతలికి వచ్చాడు. కోడలి దగ్గరికి వెళ్ళి తాను ఊరు వెళ్ళిపోతున్నట్టు చెప్పాడం ధర్మమే అయినా. అంత కంటే తెలివితక్కువ తనం మరొకటి లేదనుకున్నాడు.

తనకి గది చూపిన బంట్రోతు అటు వచ్చాడు. "చూడు బాబూ! సబు-కలెక్టరుగా రొచ్చాక నర్సింలు వచ్చి ఊరి కెళ్ళిపోయాడని చెప్పు. నాయనా" అని గేటు దాటి వచ్చేశాడు.

మనస్సు కొడుకుని చూడాలని పీకుతోంది. ఆరున్నారకావచ్చింది వేపచెట్టు మొదట్లో సంచీ ఆనించి రోడ్డుమీద వెళ్ళేకార్లని విహూగా చూస్తున్నాడు. ఆరూ ముప్పావయింది. ఒక కారు నెమ్మదిగా మలుపు తిరిగింది. మసక వెలుతురులో సత్యం ముఖం కనిపించింది పిలుద్దామను దున్నాడు.

నోరు పెగిలి రాలేదు. అంతే చాలనుకున్నాడు. గబగబా గంట స్తంభం చేరుకున్నాడు.

తన ఊరు వెళ్ళే బస్సు అక్కడాగుతుంది.

రకరకాల ఆలోచనలు ముసురుతున్నాయి. కాసేపటికి బస్సు వచ్చింది. నర్సింలు బస్సెక్కాడు. బస్సు ముందుకు సాగింది.

సత్యం ఇల్లు చేరుకున్నాడు. తాను రావడం ఆలస్యమయినందుకు మన్నించమని అతిదులందర్నీ పలకరిస్తున్నాడు. కొందరు అప్పటికే వెళ్ళిపోయారు. మిగిలిన వాళ్ళు కూడా మరో అరగంటకు వెళ్ళిపోయారు.

బంగాళాలోకి వెళ్ళగానే లోపల సంచి కనిపించింది. గుర్తు పట్టాడు. తనతోపాటు వచ్చిన భార్యని "మా నాన్న వచ్చాడా? ఏడీ?" అని ఆత్రతతో అడిగాడు. ఆమె నీళ్ళు నమిలిచింది. బంట్రోతును పిలిచింది గట్టిగా.

"మా నాన్న ఎక్కడని అడిగితే వాణ్ణి పిలుస్తావేమిటి?" కసురు కున్నట్టు అన్నాడు. "ఇందాక సందట్లో లోపలికి తీసుకు వెళ్ళమని చెప్పా."

బంట్రోతు వచ్చాడు.

"మా మామగారేరి?"

"ఎవరండమ్మగారూ! ఇందాక ఔట్ హౌస్‌లోకి తీసికెళ్ళినాయ నాండి? ఆయ నెళ్ళి పోయారండి. అయ్యగారొస్తే నర్సింలు వచ్చి వెళ్ళి పోయాడని చెప్పమన్నారండి."

"యూ డెవిల్! వాట్ హేవ్ యు డన్?" భార్య వంక తీవ్రంగా చూసి "డ్రైవర్ని పిలు" అని బంట్రోతుకి చెప్పాడు.

కారు వేగంగా గంట స్తంభం చేరుకుంది. వాకబు చేస్తే తన ఊరి బస్సు వెళ్ళిపోయిందని చెప్పారు.

సత్యం బంగళాకి తిరిగి వచ్చాడు,

అతని వైఖరి చూసి అందరు బెదిరిపోయారు. తండ్రికి జరిగిన అవమానం గ్రహించాడు. దానిపై రభస చేయడం ఇష్టం లేదు.

సత్యం భార్య తాను అంతస్తు కాపాడుకుంటున్నానని చేసిన అపకారం తెలుసుకుంది. సత్యం అంతలా వ్యాకులపడడం, ఆగ్రహించడం ఎన్నడూ చూడలేదు. నెమ్మదిగా దగ్గరికి వచ్చి "క్షమించండి. నేను చేసింది పొరపాటే ..." అంది ప్రాధేయ పడుతున్నట్లు.

తన తండ్రి మనస్సు పడిన వ్యధ సత్యాన్ని దహించివేస్తోంది. కోపాన్ని దిగమింగుకుని రుద్ధమైన కంఠంతో "నిన్నూ నన్నూ క్షమించవలసింది మా నాన్న .... మాకుటుంబం.... బయలుదేరు, మరో పావు గంటలో మా ఊరికి వెళాం. నువ్వక్కడ ఒక వారం రోజులుండాలి; నేను తిరిగి రేపు పొద్దున్న వచ్చేస్తానిక్కడికి" అంటూ తన నిర్ణయం చెప్పాడు.

భార్య మారు చెప్పకుండా పెట్టె సర్దుకుంది.

ఈలోగా డ్రైవరుకు చెప్పి కారు సిద్ధం చేయించాడు పనిమనిషికి తమ ప్రయాణం గురించి చెప్పాడు సత్యం ఊరు వెళ్తున్న సంగతి ఫోను చేసి మరో ఆఫీసరుకి చెప్పాడు.

సరిగ్గా పావు గంటకే కారు బయలుదేరింది. ముందు బస్సులో ప్రయాణిస్తున్న నర్సింలు కాళ్ళను సత్యం మనస్సు కన్నీటితో కడుగుతోంది.